తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత !

ఇసుకాసురులు మళ్లీ రెచ్చిపోతున్నారు. నదులు, కుంటలు, వాగులు, వంకలు దేన్నీ వదిలిపెట్టడం లేదు. రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చోటా మోటా నేతల నుంచి బడా బాబుల వరకూ ఇసుకనే ప్రధాన వనరుగా చేసుకున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు, పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారు.

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో జోరుగా ఇసుక దందా
- అధికారమే అండగా రెచ్చిపోతున్న తమ్ముళ్లు
- నదులు, కుంటలు, వాగులు, వంకలు దేన్నీ వదిలిపెట్టని వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


ఇసుక తరలింపుతో హిందూపురం సమీపంలోని పెన్నాలో ఏర్పడిన గోతులు

'పురం'లో మౌఖిక ఆదేశాలు

హిందూపురం అర్బన్: హిందూపురానికి నిత్యం 500 ట్రాక్టర్ల ఇసుక అవసరం కాగా ఎక్కడా ఇసుక రీచ్ లేదు. దీంతో తెలుగు తమ్ముళ్లు ఇసుక మాఫియా సాగిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. ఎన్నికల్లో తోడుగా ఉన్నాం. ఇప్పుడు కనీసం ఇసుక కూడా తోలుకోనివ్వరా అంటూ ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వెళ్లి మరీ వాదనకు దిగుతున్నారు. దీంతో అధికారులు కూడా చూసీచూడనట్లు పోవాలని మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారు. జయమంగళి, పెన్నా నదుల నుంచి ఇసుకను రోజూ అక్రమంగా సమీపంలోని కర్ణాటక రాష్ట్రం ప్రాంతాలకు తరలిస్తూన్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అలా పట్టుకున్నారు.. ఇలా వదిలేశారు

చిలమత్తూరులో 20 రోజుల క్రితం కొడికొండ చిత్రావతి నది నుంచి అనధికారికంగా తోలుతున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సెబ్ అధికారులు కొడికొండ చెక్‌పోస్టు వద్ద పట్టుకోగా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ రాగానే వదిలేశారు.

☛ హిందూపురం రూరల్ మండలంలోని బేవనహళ్లి, పోచనపల్లి గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా నిత్యం అటు కర్ణాటక ప్రాంతానికి, పారిశ్రామిక వాడకు, హిందూపురం పట్టణానికి టీడీపీ సానుభూతి పరులు ఇసుక తోలుతున్నారు.

చెప్పడమే ఆలస్యం...

హిందూపురం సమీపంలోనే పెన్నా, జయమంగళి, చిలమత్తూరు మండలంలో కుషాతి, చిత్రావతి నదులున్నా ఇక్కడ మాత్రం ఇసుక రీచ్‌లు లేవు. దీంతో ఇసుక కదిరి సమీపంలోని కుటాగల్లు లేదా రామగిరి నుంచి తెచ్చుకోవాలి. అక్కడి నుంచి 80 కిలో మీటర్లు పైనే. అక్కడి నుంచి హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి ఇసుక తెచ్చుకోవాలంటే టన్నుకు రూ.5 వేలకు పైగా ఖర్చు వస్తుంది. దీంతో ఇళ్లు, భవన నిర్మాణ దారులు అందుబాటులో ఉండే ట్రాక్టర్ల వారితో ఇసుక తోలించుకుంటున్నారు. దీంతో ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ. 3000 లకే దొరకుతోంది. దీంతో అక్రమ రవాణాదారులకు చెప్పేదే వెంటనే ఇళ్ల వద్ద వచ్చి పడుతోంది.

అక్రమంగా ఇసుక రవాణా ఇలా...

హిందూపురం నియోజకవర్గం:

- హిందూపురం సమీపంలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి హిందూపురం, లేపాక్షి, కర్ణాటక రాష్ట్రానికి తరలింపు
- చిలమత్తూరు మండలం కోడూరు, కొడికొండ సమీపంలోని బలిజపల్లి వద్ద చిత్రావతి నది నుంచి , చేనేపల్లి వద్ద కుషావతి నది నుంచి ఇసుక తోడి చిలమత్తూరు మండల కేంద్రంతో పాటు కర్ణాటకకు తరలిస్తున్నారు.
- హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు పరిధిలోని వాగులు, వంకల నుంచి కూడా ఇసుక తరలింపు
- హిందూపురం నియోజకవర్గంలో రోజూ దాదాపు వంద ట్రాక్టర్లకు పైగానే ఇసుక తరలిపోతోంది.
- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి 3,500 వసూలు చేస్తున్నారు.

మడకశిర నియోజకవర్గం :

- మడకశిర నియోజకవర్గంలో ముఖ్యంగా అగళి మండలంలోని సువర్ణముఖి నది నుంచి ఇసుకాసురులు జోరుగా ఇసుక తరలిస్తున్నారు.
- మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల మండలాల్లో ఉన్న వాగులు, వంకల్లోని ఇసుకను ఎప్పటికప్పుడు ఊడ్చేస్తున్నారు.

పెనుకొండ నియోజకవర్గం :

- పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి, మల్లమోతుకపల్లి, కాలువపల్లి, పరిగి, నేతలపల్లి, శాసనకోట, శీగిపల్లి, గణపతిపల్లి, పైడేటి, ఊటుకూరు, బోరెడ్డిపల్లి ప్రాంతాల్లో ఇసుకను ఎడాపెడా తవ్వేస్తున్నారు.
- రొద్దం మండలం పెద్దమంతూరు, రొప్పాల, కుర్లపల్లి, కొత్తపల్లితో పాటు పెనుకొండలోని శెట్టిపల్లి, గోరంట్ల మండలం చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాల నుంచి నిత్యం ఇసుక తరలిపోతోంది.

మంత్రి సవిత పేరుతో దందా

పరిగి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెనుకొండ నియోజకవర్గంలోని పెన్నా, జయమంగళి, చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాల్లోని ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు టీడీపీకి చెందిన కొందరు నేతలు. పోలీసుల దాడుల్లో పట్టుబడినా ట్రాక్టర్లను సీజ్ చేసే లోపే మంత్రి సవిత మనిషి అంటూ తప్పించుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో చేసేదేమీ లేక కొందరు పోలీసులు చేతివాటానికి అలవాటు పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒక వేళ ట్రాక్టర్లు సీజ్ చేసినా ట్రాక్టర్లను కోర్టుకు తరలించకుండా తహసీల్దారు పరిధిలో తక్కువ జరిమానా విధించి కేసుల నమోదు నుంచి బయటపడుతున్నారని చెబుతున్నారు. గడిచిన మూడు నెలలుగా టీడీపీ నాయకులు ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ సొమ్ముచేసుకుంటున్నారని అంటున్నారు.

అక్రమ రవాణాలో 'ఖాకీ'

ఇసుక రవాణాకు చెక్ పెట్టాల్సిన పోలీసులు కూడా ఇసుక దందాకు తెరలేపారు. సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్ రెండు బినామీ ఇసుక ట్రాక్టర్లతో నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తెలిసింది. ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలు చొప్పున అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నారని చెబుతున్నారు. పరిగి, రొద్దం మండలాల నుంచి సోమందేపల్లికి నిత్యం 6 నుంచి 8 ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారంటున్నారు. ఇదంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతోందని సమాచారం.

ఇసుక కోసమే 30 ట్రాక్టర్ల కొనుగోలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రొద్దం మండలంలో ఓ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఏకంగా 20 నుంచి 30 ట్రాక్టర్లను కొత్తగా కొనుగోలు చేశారని చెబుతున్నారు. నిత్యం కొత్తపల్లి, రొప్పాల, పెద్దమంతూరు నుంచి ఇసుక తరలింపునకు వీటిని వినియోగిస్తున్నారంటున్నారు.


పరిగి మండలం ఊటుకూరు పరిధిలోని పెన్నానది నుంచి ట్రాక్టర్‌లోకి ఇసుకను నింపుతున్న దృశ్యం

'సువర్ణముఖి' నుంచి ఎడాపెడా..

మడకశిర: నియోజకవర్గంలో హద్దు అదుపులేకుండా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మడకశిర, అమరాపురం, గుడిబండ,రొళ్ళ మండలాల్లోని వంకలు, వాగుల్లోని ఇసుకను అక్రమంగా తరలించి ఇసుకాసురులు సొమ్ము చేసుకుంటున్నారు. అదే విధంగా అగళి మండలంలోని సువర్ణముఖి నది కేంద్రంగా ఇసుక దందా జోరుగా సాగుతోంది. ప్రతి రోజూ ఈనది నుంచి ట్రాక్టర్లలో ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక దందా ఊపందుకుంది.

చోద్యం చూస్తున్న అధికారులు

నియోజకవర్గవ్యాప్తంగా ఇసుక దందా జోరుగా జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. పోలీస్, రెవెన్యూ, సెబ్ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా సువర్ణముఖి నది నుంచి ఇసుకను పట్టపగలే ట్రాక్టర్లలో తరలిస్తున్నా ఎవరికీ పట్టడం లేదని వాపోతున్నారు. ఇసుక దందా జోరుగా సాగుతున్నా ఈ మూడు నెలల్లో నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో కేవలం 6 ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు.


అగళి మండలంలోని సువర్ణముఖి నదిలో ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న దృశ్యం

సీఎంకు రైతుల ఫిర్యాదు

అగళి మండలంలో సువర్ణముఖి నది దాదాపు 25 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ నది చుట్టూ దాదాపు 1000 రైతుల వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఈ నదిలో ఇసుకను తోడేస్తుండడంతో భూగర్భజలాలు తగ్గిపోతాయని పలువురు రైతులు ఇసుకను అక్రమంగా తవ్వకుండా చూడాలంటూ సీఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే జిల్లా, రాష్ట్రస్థాయి పోలీస్, రెవెన్యూ, సెబ్ అధికారులకు కూడా రాత మూలకంగా ఫిర్యాదు చేశామని రైతులు చెబుతున్నారు.

అధికార పార్టీ నాయకుల అండ

నియోజకవర్గంలోని ఇసుకాసురులకు అధికార పార్టీ నాయకుల అండ ఉందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవడం లేదంటున్నారు. తమ పార్టీకి చెందిన వారు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవద్దని అధికార పార్టీ నాయకుల నుంచి అధికారులకు ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం.


ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపుతో హిందూపురం మండలం బేవనహళ్లి వద్ద రహదారి దుస్థితి

ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు



మూడేళ్ల క్రితం వరకూ పరిగి మండలంలో ఇసుక కొరత భారీగా ఉండేది. అప్పటికే కొందరు ఇసుకను అక్రమంగా తవ్వేసి కోట్లాది రూపాయలను ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి జేబులు నింపుకున్నారు. తాజాగా నదుల్లో నీటి ప్రవాహంతో ఇసుక కొట్టుకురావడంతో ప్రజల స్థానిక అవసరాలకు ఉపశమనమిస్తోంది. అయితే నదుల్లోని ఇసుకను మళ్లీ అక్రమంగా తరలిస్తున్నారు. అధికార యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నాం.

– బద్రీ, పరిగి

భూగర్భ జలమట్టం తగ్గుతోంది



సువర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పట్టపగలే ఇసుకను అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమంగా తరలిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో భూగర్భజల మట్టం తగ్గుతుంది. ఫలితంగా వ్యవసాయ బోర్లు ఎండిపోయి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇసుక తరలింపును ఆపి రైతుల వ్యవసాయ బోర్లు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మల్లేశప్ప, మధూడి, అగళి మండలం

చెక్ పాయింట్లతో కట్టడి చేస్తాం



ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టాము. జిల్లా వ్యాప్తంగా కర్ణాటక సరిహద్దు పోలీస్ సబ్‌డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ణాటకకు వెళ్లే దారుల్లో చెక్ పాయింట్లు ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసేలా చర్యలు తీసుకుంటాము. అనుమతులు లేకుండా ఇసుక తరలించే వాహనాలను ఎక్కడికక్కడ సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాము.

– వి.రత్న, ఎస్పీ

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ


వికాస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

పెనుకొండ: స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరరెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ పరామర్శించారు. శంకరరెడ్డి కుమారుడు వికాస్‌కుమార్‌రెడ్డి గుండెపోటుతో మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న శంకరనారాయణ, ఆయన సోదరుడు మాలగుండ్ల రవి, రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహా తదితర నాయకులు శంకరరెడ్డి ఇంటి వద్దకు చేరుకుని భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులోనే వికాస్‌రెడ్డి చనిపోవడం బాధాకరమని మాజీ మంత్రి విచారం వ్యక్తం చేశారు.

హౌసింగ్ లబ్ధిదారులతో రేపు సమావేశం

పెనుకొండ: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, చేనేత జౌళిశాఖామంత్రి సవిత ఈ నెల 5న స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశమవుతారని హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ తెలిపారు. జగనన్న హౌసింగ్, ఎన్టీఆర్ హౌసింగ్, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై మంత్రి లబ్ధిదారులతో చర్చిస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వక్క రైతులకు నేడు అవగాహన

అమరాపురం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు వక్క రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రైతు మంజునాథ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వక్క తోట పెంపకం యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండలంలోని వక్క తోటలు సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంట్లోకి దూరిన నాగుపాము


పామును చంపేసిన దృశ్యం


రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో ఓ ఇంట్లోకి నాగుపాము దూరింది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోని మెట్లపై నుంచి పాము మిద్దెమీదకు ఎక్కుతుండగా ఆ ఇంట్లోని వారు గమనించి పామును చంపేశారు. గమనించకుండా ఉండి ఉంటే పాము నుంచి ప్రమాదం ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యతో పాటు నైపుణ్యం అవసరం


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: యువతకు విద్యతో పాటు నైపుణ్యం ఎంతో అవసరమని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాభివృద్ధిశాఖ, సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహకారంతో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 92 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 40 మంది వివిధ కంపెనీలకు ఎన్నికయ్యారు. మరో 29 మంది షార్ట్‌లిస్ట్ అయినట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చైతన్యకుమార్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాడేపై అవగాహన


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

గుడిబండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళారం ఆశా డే కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ మంజువాణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌందర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలి



ఏఎల్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం టౌన్: ప్రీకాట్ బీ మిల్లులో కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏఎల్ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఏఎల్ఓ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ మిల్లులో యాజమాన్యం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అక్రమంగా కార్మికులను తొలగిస్తోందన్నారు. నోటీసులు ఇస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. అనారోగ్యం పాలైనప్పటికీ కార్మికులపై మానవత్వం చూపకుండా ఏకపక్ష నిర్ణయాలతో కార్మికులకు నష్టం చేకూరుస్తున్నారన్నారు. వెంటనే తొలగించిన కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి బాబు, ప్రీకాట్ బి ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి మారుతీరెడ్డి, ప్రీకాట్ బి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గంగాధర్, కోశాధికారి మాచప్ప, ప్రీకాట్ నాయకులు అలీమ్, శివకుమార్, నారాయణరెడ్డి, రంగప్ప, అశ్వతనారాయణ, ఏఐటీయూసీ నాయకులు సమీవుల్లా, నౌషాద్, జియా, జిలాన్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రస్వామి జయంతి


అగళి మండలం మధూడిలో వీరభద్రస్వామి


లేపాక్షి: ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

లేపాక్షి/అగళి: ప్రముఖ పర్యాటక క్షేత్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం వీరభద్రస్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగం, మహామంగళారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

అగళి: మండల పరిధిలోని మాధూడి గ్రామంలో వీరభద్రస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామి వారికి రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం తదితర పూజలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన చెలిమిడిని జ్యోతులుగా చేసుకొని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి వీరభద్రస్వామికి సమర్పించారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం

- పార్టీ బలోపేతానికి కృషి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఈరలక్కప్ప మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. అనంతరం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వైఎస్ జగన్ తెలుసుకున్నారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన ఉండి సమస్యలపై పోరాటం చేయాలని సూచించినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ మూడు నెలల్లోనే అన్ని విధాలుగా విఫలమైందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, ఈ నేపథ్యంలో ప్రజలు చంద్రబాబు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని వైఎస్ జగన్ తమకు వివరించారని తెలియజేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేసి ప్రజలకు అండగా ఉండాలని సూచించారన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక


ఏ దుర్గమ్మ


హనుమంతరాయ


రాజగోపాల్

పావగడ: జిల్లా స్థాయి అత్యుత్తమ ఉపాధ్యాయులుగా పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సహోపాధ్యాయురాలు ఏ దుర్గమ్మ, వైఎస్ హొసకోటలోని పడమట వీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సహోపాధ్యాయుడు హెచ్ హనుమంతరాయ, మరిదాసనహళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజశేఖర్ ఎంపికయ్యారు. కొరటగెరె పట్టణంలోని మారుతీ కల్యాణ మంటపంలో ఈ నెల 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి ఉత్తమ ఉపాధ్యాయ ప్రశస్తి అందిస్తారని స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పేదలకు న్యాయం చేయండి

పెనుకొండ: అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ఎంపీ బీకే పార్థసారథిని కోరారు. మంగళవారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో పేదలతో పాటు ఎంపీని కలిశారు. సోమందేపల్లి గ్రామ రెవెన్యూ పొలం సర్వే నంబర్ 700లో పేదల గుడిసెలను రెవెన్యూ అధికారులు తొలగించారన్నారు. పేదల సమస్యను పరిశీలించి పట్టాలు మంజూరు చేయించాలని కోరారు. త్వరలో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను నాశనం చేయడంతోనే విజయవాడలో వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 17వవార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర సుభద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. వలంటీర్ల సేవలను ప్రభుత్వం ఉపయోగించుకొని ఉంటే విజయవాడలో బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగి ఉండేదన్నారు. పెండింగ్‌లో ఉన్న వలంటీర్ల గౌరవ వేతనాన్ని వెంటనే ఇచ్చి వారి సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

అగళి: గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించాలన్నారు. సమావేశంలో డాక్టర్ శివనంద, ఈఓఆర్డీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమావేశం

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధిపై ఎంపీడీఓ, ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో మంగళవారం మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 11 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సభల ద్వారా అభివృద్ధి ప్రణాళిక తయారు చేశారు. ఈ పనులపై మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, సభ్యులు చర్చించారు. రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానంపై ఏకగ్రీవంగా తీర్మానం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఏపీఓ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కాపీలు ఇవ్వాలి

పెనుకొండ: ఆశా వర్కర్ల ఒప్పంద కాపీలు ఇవ్వాలని పెనుకొండ ప్రభుత్వాస్పత్రి వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని 2024 ఫిబ్రవరి 9న చర్చలు జరిపి కుదిరిన ఒప్పంద జీఓలు, సర్క్యులర్లు ఇవ్వాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆశావర్కర్స్‌కు విడుదల చేయాల్సిన జీఓ కాపీలు, ఒప్పంద జీఓ కాపీలు తాత్కాలికంగా నిలుపుదల చేశారని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గలిబిపల్లిలో పౌష్టికాహార వారోత్సవాలు

లేపాక్షి: మండలంలోని గలిబిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు గ్రామంలో ర్యాలీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలతో పాటు తీసుకోకపోవడం వలన నష్టాలను అంగన్‌వాడీ కార్యకర్త రత్నమ్మ వివరించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

హిందూపురం టౌన్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మీ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంటి జబ్బులపై అవగాహన

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నేత్రదానం, కంటి చూపు, జబ్బులు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరంగశ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకుని కంటి లోపం లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. నేత్రదానంపై విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.